సాక్షి
నిజామాబాద్

ఆదివారం । 10 । ఆగస్టు । 2025



సెల్ఫీ విత్ రాఖీ
రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరులకు రాఖీలు కట్టిన సోదరీమణులు.. సెల్ఫీలు తీసుకొని సాక్షితో పంచుకున్నారు.
- 8లో ▸



వైద్యసేవలు అందించాలి
ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకాన్ని పెంచాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.9 /22.4

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. అర్ధ రాత్రి తర్వాత మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అడవి మామిడిపల్లి రైల్వేగేట్ శాశ్వతంగా మూసివేత

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి వద్ద ఆర్వోబీ పనులు పూర్తయి, వాహనాల రాకపోకలు సాగుతుండటంతో అక్కడ ఉన్న రైల్వేగేట్‌ను శాశ్వతంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. ఈనెల 9 నుంచి రైల్వేగేట్‌ను ఎత్తివేస్తున్నట్లు మాక్లూర్ తహసీల్దార్, పోలీసులకు ఉత్తర్వు కాపీలను పంపించినట్లు వెల్లడించారు. కానీ కొందరు వాహనదారులకు ఈ విషయం తెలియక ఇంకా శనివారం రాత్రి వరకు రైల్వే గేట్ నుంచే రాకపోకలు సాగించారు.

ఆర్మూర్‌లో చిరుత కలకలం

ఆర్మూర్‌టౌన్: పట్టణ శివారులోని పెద్దమ్మ ఆలయం పరిసరాల్లో చిరుతపులి సంచారం కలకలం రేపింది. శుక్రవారం ఉదయం ఆలయానికి వెళ్లిన పలువురు భక్తులు ఒక్కసారిగా కోతులు పరిగెత్తిరావడంతో ఆందోళన చెందారు. ఈక్రమంలో వారు పరిసరాలను పరిశీలించగా సుదూరంలో చిరుత కనిపించడంతో భయంతో హుటాహుటిన ఆలయం నుంచి వెనుదిరిగారు. ఇదిలా ఉండగా కొన్ని రోజుల క్రితం ఆలయ పరిసర ప్రాంతాల్లో మేతకు వెళ్లిన గొర్రెల మంద నుంచి ఒక మేక కనబడకుండపోయినట్లు గొర్ల కాపరులు శుక్రవారం రాత్రి ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. చిరుత ఆనవాళ్లను గుర్తించడానికి ఆదివారం వెళ్లనున్నట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాలు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. హనుమకొండ, జనగాం జిల్లాల్లో ఈనెల 8, 9 తేదీల్లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్ టోర్నమెంట్ పోటీలు జరిగాయి. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు తరలిరాగా, పోటీల్లో మన జిల్లా క్రీడాకారులు పాల్గొని, 14 పతకాలు సాధించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రత్నాకర్ నరాల, రాజాగౌడ్ శనివారం ప్రత్యేకంగా అభినందించారు. వారిలో జావెలిన్‌త్రో (అండర్–18)లో బస్సి జైపాల్ బంగారు, రజత పతకం సాధించారు. అండర్ 16లో గఫర్, అండర్ 20లో సోయల్ కాంస్య పతకం సాధించారు. లాంగ్‌జంప్ (మహిళల విభాగం)లో సత్య రజత పతకం, అండర్ 18 విభాగంలో ప్రణయ్ కాంస్య పతకం సాధించారు. అలాగే పలువురు వివిధ విభాగాల్లోనూ పతకాలు సాధించారు.

గిరిజన ఉత్పత్తులలో నంబర్ వన్



లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని కుమురం భీమ్ ఆదివాసి బంజారా భవన్‌లో సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి గిరిజన ఉత్పతుల ప్రదర్శనలో లింగంపేట ప్రథమ స్థానంలో నిలిచిందని ఏపీఎం వినోద్‌కుమార్ తెలిపారు. రాష్ట్రం వ్యాప్తంగా పది మందిని స్వయం సహాయక సంఘాల సభ్యులను ఎంపిక చేయగా, కామారెడ్డి నుంచి లింగంపేట మండల కేంద్రానికి చెందిన రాథోడ్ దుర్గాబాయి ఎంపికైనట్లు తెలిపారు. ఆమె తయారు చేసిన బంజారా ఆభరణాలు, అలంకరణ వస్తువులు ఆకట్టుకున్నాయన్నారు.



నేటి తరంలో క్రేజీ..
- ప్రజలకు మరింత చేరువవుతున్న వాట్సాప్ స్టేటస్ ఫీచర్
- ప్రతి నిత్యం తమ భావోద్వేగాన్ని పంచుకుంటున్న ప్రజలు
- మెరుగుపడుతున్న కమ్యూనికేషన్

స్టేటస్.. ఏదైనా స్టైయిట్‌గా..

సండే స్పెషల్



నిజామాబాద్‌అర్బన్: ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా హవానే జోరుగా సాగుతోంది. ముఖ్యంగా సమాచార పంపిణీలో వాట్సాప్ అగ్రగామిగా నిలుస్తోంది. ప్రతి ఒక్కరూ ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు వాట్సాప్ వాడకం తప్పనిసరిగా మారిపోయింది. వాట్సాప్‌లోని స్టేటస్ ఫీచర్ ద్వారా ఒకరి అభిరుచులను, ఒకరి విషయాలను, ఒకరి చెడు, మంచి ఘటనలను తేలికగా తెలుసుకోగలుగుతున్నారు. ఈ నేపథ్యంలో వాట్సాప్ స్టేటస్‌పై 'సాక్షి' ప్రత్యేక కథనం..

మనం ఆనందంలో ఉన్నా, కొత్త ప్రదేశానికి వెళ్లినా, మూవీకి వెళ్లినా, మంచి ఫుడ్ తిన్నా, బాధాకరమైన సమాచారం ఉన్నా, లేదా ఇంట్లోనే ఉన్నా, ఈ విషయాలను ఎవరికీ చెప్పకున్నా, వాట్సాప్ స్టేటస్‌లో ఫొటో కానీ, వీడియో కానీ పెట్టేస్తే అందరికీ తెలిసిపోతుంది. అలాగే ఎవరికైనా బర్త్‌డే, మ్యారెజ్ డే విషెస్, సంతాపం తెలపాలన్నా స్టేటస్‌లో పెట్టేస్తే, వారికి చెప్పకనే చెప్పేస్తుంది. ప్రస్తుత ఆన్‌లైన్ కాలంలో అన్నింటికీ ప్రచార వేదికగా వాట్సాప్ స్టేటస్ మారిపోయింది.





ప్రతిభను కనబర్చినా..

చాలామంది తమ వ్యక్తిగత ప్రతిభ చాటడానికి స్టేటస్‌ను ఉపయోగించుకుంటున్నారు. విద్యా, ఉద్యోగం, క్రీడలు ఇలా ఎందులోనైనా వారు ప్రతిభ సాధించి ఉంటే అప్పటికప్పుడు స్టేటస్‌లో పోస్ట్ చేస్తున్నారు. లేదా వారి కుటుంబ సభ్యులు ఎవరు ప్రతిభ కనబర్చినా పోస్ట్ చేస్తున్నారు. ఈ పోస్టులు చూసినవారు వారిని అభినందనలతో ముంచెత్తుతున్నారు.

మనోభావాలను వ్యక్తపరుస్తూ..

కొందరు వారి మనోభావాలను తెలియజేసే విషయాలను ఎంపిక చేసుకొని స్టేటస్‌లో పోస్ట్ చేస్తున్నారు. చాలా మంది వారికి జరిగిన మంచి, చెడులను ఇతరులకు చెప్పేందుకు స్టేటస్‌ను ఆశ్రయిస్తున్నారు. అలాగే కొందరు ప్రతిరోజు ఉదయమే వారానికి తగ్గట్టు దేవుళ్ల ఫొటోలు, పాటలతో స్టేటస్ పెడుతుంటారు. ప్రత్యేక రోజులు, పండుగల్లోనూ శుభాకాంక్షలు తెలుపుతూ స్టేటస్ పెట్టే వారు కూడా చాలామంది ఉన్నారు.

చూసేవారు ఎక్కువే..

వాట్సాప్‌ను ఉపయోగించే వారందరూ స్టేటస్‌లో వారికి నచ్చిన అంశాలను పోస్ట్ చేయడంతోపాటు ఇతరుల స్టేటస్‌ను చూస్తూ ఉంటున్నారు. ఐదేళ్ల క్రితం వరకు వాట్సాప్ యాప్ ఉపయోగించే వారిలో పది నుంచి 20 శాతం మాత్రమే స్టేటస్ ఫీచర్‌ను ఉపయోగించేవారు. ఇప్పుడు 80 శాతం మంది వరకు ఈ ఫీచర్‌ను చూస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు రోజుల్లో నాలుగైదు సార్లు స్టేటస్‌ను చూడందే నిద్రపోవడం లేదు. వారు పెట్టిన పోస్టులను ఎంతమంది చూశారు? ఎవరైన ప్రతి స్పందించారా అన్న ఆత్రుత కోసం వెతికేవారు ఎంతోమంది ఉన్నారు. ఇలా వారు పెట్టిన పోస్ట్‌కు ఎవరు స్పందించకపోతే తీవ్ర అసంతృప్తి గురయ్యే వారు కూడా ఉన్నారు. ఇదిలా ఉండగా వాట్సాప్ స్టేటస్‌తో వ్యక్తిగత విషయాలు పంచుకోవడం వల్ల తమ భద్రతకు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగుతుందన్న విషయాన్ని కూడా గుర్తించాలని నిపుణులు సూచిస్తున్నారు.

తానేంటో తెలుపుతూ..

స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ వాట్సాప్ ఉపయోగిస్తున్నారు. ఇటీవల కాలంలో వాట్సాప్ యాప్‌లోని స్టేటస్ ఫీచర్‌ను ఉపయోగించుకుంటున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఆధునిక టెక్నాలజీకి అలవాటు పడ్డ చాలా మంది స్టేటస్ పోస్ట్ పెట్టడం అనేది ఒక స్టేటస్‌గా భావిస్తున్నారు. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ తదితర మాధ్యమాలు ఉన్నప్పటికీ ఎక్కువగా వాట్సాప్ స్టేటస్ వేదికగా వాడుకుంటున్నారు. తానేంటో తెలిపేందుకు, ఇతరుల విషయాలు తెలుసుకునేందుకు స్టేటస్ ముఖ్య భూమిక పోషిస్తుంది. రోజువారి జీవితంలో చేసే పనులను, వెళ్లిన ప్రదేశాలను వాట్సాప్ స్టేటస్‌గా పెడుతూ ఎప్పటికప్పుడు తాము ఉన్న స్థితిని తెలియజేస్తున్నారు.

వ్యాపారానికి ప్రచారం..

వ్యాపార అభివృద్ధికి సోషల్ మీడియా ఒక ప్రచార వేదికగా మారింది. అందులోనూ అందరూ ఎక్కువగా చూసే వాట్సాప్ స్టేటస్‌ను చాలామంది వ్యాపారులు తమ వ్యాపార అభివృద్ధి కోసం ఉపయోగించుకుంటున్నారు. వ్యాపారం గురించి బ్రోచర్లు ముద్రించి స్టేటస్‌లో పోస్ట్ చేస్తున్నారు. ఇక విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు పాఠశాలకు సంబంధించిన వివరాలను ప్రతిరోజు స్టేటస్‌లో ప్రదర్శిస్తున్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్, హోటల్స్, వివిధ దుకాణాలు, మాల్స్ ఇలా అన్ని వ్యాపార రంగాల వారు తమ ఆఫర్లను, సర్వీసులను స్టేటస్‌లో పెడుతూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు.

సమాచారానికి వేదికయింది..



స్టేటస్ అనేది సమాచారానికి వేదికగా మారిపోయింది. ఈ మధ్య మనషుల మధ్య పలకరింపులు తగ్గిపోయాయి. కేవలం సోషల్ మీడియా ద్వారానే పలకరింపులు పెరుగుతున్నాయి. ఫలానా వ్యక్తి ఆయన పరిస్థితిని స్టేటస్ ద్వారా తెలుసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రతి ఒక్కరూ తమ వ్యవహారాలను నిత్యం స్టేటస్ వేదికగానే తెలియజేస్తున్నారు.
– భానుక చంద్రశేఖర్, ముబారక్‌నగర్

అతిగా వాడకూడదు



సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగించడం మంచిది కాదు. అలా అని స్టేటస్‌ను కూడా ఎక్కువగా వినియోగించడం మంచిది కాదు. వ్యసనంగా మారితే మానసిక సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కొందరు ఫోన్ లేనిదే ఉండడం లేదు. ఇది చాలా ప్రమాదకరం ఎక్కువగా ఫోన్‌కు అంకితం కావడం వల్ల ఇబ్బందులు వస్తాయి.
– విశాల్, మానసిక వైద్యనిపుణులు, నిజామాబాద్

ఉపయోగాలు.. నష్టాలు



స్టేటస్ పరిమితంగానే వాడాలి. దీనివల్ల కొంత మేర ఉపయోగం ఉన్నా, అంతే నష్టాలు కూడా ఉన్నాయి. ప్రతి రోజు స్టేటస్‌కు అంకితం కాకుడదు. కొందరు ఇతరుల స్టేటస్‌ను కూడ దుర్వినియోగం చేసే అవకాశం ఉంది. ఇలాంటివి చేయకూడదు.
– రమేష్, ప్రభుత్వ టీచర్, నిజామాబాద్

క్షణాల్లో తెలుస్తుంది..



స్టేటస్ వల్ల అనేక సమాచారం తెలుస్తుంది. ప్రపంచంలో ఎక్కడున్నా స్టేటస్‌లో పెట్టగానే వారి సమాచారం క్షణాల్లో తెలుస్తుంది. మంచి, బాధాకారం వంటి విషయలు కూడ వెంటనే తెలుస్తున్నాయి. వివిధ రంగాల వారి ప్రచారాలు, సమాచారం వెంటనే తెలుస్తుంది.
– లక్ష్మణ్, కమలాపూర్

నిజామాబాద్ బస్టాండ్‌లో గుమిగూడిన ప్రయాణికులు



కిటకిటలాడిన బస్టాండ్

నిజామాబాద్ బస్టాండ్ శనివారం ప్రయాణికులతో కిటకిటలాడింది. రాఖీ పండుగను పురస్కరించుకొని సోదరులకు రాఖీ కట్టేందుకు, కుటుంబ సభ్యులతో కలిసి పండుగ చేసుకోవడానికి తమ ఊర్లకు వెళ్లేందుకు మహిళలు భారీగా బస్టాండ్‌కు తరలివచ్చారు. బస్సుల కోసం ఎదురుచుస్తున్న ప్రయాణికులతో బస్టాండ్ సందడిగా మారింది. రద్దీ ఎక్కువ ఉండటంతో సీట్ల కోసం ప్రయాణికులు బస్సులు రాగానే ఎగబడ్డారు. మరికొందరూ కిటికీల నుంచి దూరి సీట్లను దక్కించుకున్నారు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నిరీక్షణ ఇంకెన్నాళ్లు..?

- పెండింగ్‌లోనే అభివృద్ధి పనుల బిల్లులు
- నిధుల కోసం ఎదురుచూస్తున్న మాజీ సర్పంచులు

మోర్తాడ్ మండలం సుంకెట్ గ్రామ సర్పంచ్ కడారి శ్రీనివాస్ తన పదవీ కాలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టగా, అందుకు సంబంధించి రూ.58 లక్షల బిల్లు ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉంది. అలాగే మోర్తాడ్ గ్రామ సర్పంచ్‌గా పని చేసిన ధరణికి కూడా పలు పనులకు సంబంధించి రూ.70 లక్షల బిల్లు మంజూరు కావాల్సి ఉంది. వీరి పదవీ కాలం ముగిసిపోయి ఏడాదిన్నర కాలం అవుతున్నా ఇప్పటికీ బిల్లులు మాత్రం రాలేదు. దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల మాజీ సర్పంచ్‌లకు సైతం బిల్లులు మంజూరు కాకపోవడంతో మానసిక వేదనకు గురవుతున్నారు.

మోర్తాడ్(బాల్కొండ): గ్రామాల్లో గత సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు ఇప్పటికీ విడుదల కాలేవు. దీంతో వారు నెలల తరబడి నిధుల రాక కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఫిబ్రవరి 2024లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిపోయింది. అంతకుముందు నుంచే వారికి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సర్పంచ్‌లుగా వ్యవహరించిన వారికి బిల్లులు మంజూరు చేయకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏడాదిపాటు కాలయాపన చేసింది. అప్పట్లో ఆ పార్టీకి చెందిన వారే సర్పంచ్‌లుగా ఎక్కువ మంది ఉండటంతో బిల్లుల గురించి అప్పటి ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నించలేకపోయారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా మాజీ సర్పంచ్‌ల బిల్లులకు మోక్షం లభించడం లేదు.

జిల్లాలో రూ.15 కోట్లకు పైగా పెండింగ్..

జిల్లాలోని మాజీ సర్పంచ్‌లకు దాదాపు రూ.15 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అంచనా. 15వ ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధులకు సంబంధించి బిల్లులు చేసి పంపినా ట్రెజరీల్లోనే చెల్లింపులు నిలిచిపోయాయి. కొందరు సర్పంచ్‌లకు టోకెన్‌లు జారీ చేసినా నిధులు లేకపోవడంతో ఖాతాల్లో సొమ్ము జమ కావడం లేదు. తమ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు అనేక మార్లు సచివాలయం, అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఆందోళన కార్యక్రమాలను నిర్వహించడానికి యత్నించగా పోలీసులు ముందస్తు అరెస్టులతో అడ్డుకున్నారు. గత ప్రభుత్వాన్ని బిల్లుల కోసం ప్రశ్నించని నాయకులు ఇప్పుడు నిరసన తెలియజేస్తూ ఈ ప్రభుత్వం పరువు తీయాలని చూస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.



సుంకెట్ ఉన్నత పాఠశాలలో నిధులు రాకపోవడంతో అసంపూర్తిగా నిలిచిన కిచెన్ షెడ్ నిర్మాణం

ముడుపులు ఇస్తామంటూ..

బిల్లులకు సంబంధించి పలువురికి టోకెన్‌లను ఆర్థిక శాఖ జారీ చేసింది. కాగా బిల్లుల చెల్లింపులు మొత్తం హైదరాబాద్ నుంచి పెండింగ్‌లో ఉండటంతో ఒక్కో బిల్లుకు 18 శాతం వరకు ముడుపులు ఇస్తామని ఉద్యోగులను ప్రలోభపెట్టాలని చూస్తున్నారు. కానీ మాజీ సర్పంచ్‌లు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం లేకపోయింది. ఏదేమైనా మాజీ సర్పంచ్‌లు తమ బి ల్లుల కోసం నిరీక్షించక తప్పదని స్పష్టమవుతోంది.

ప్రభుత్వం స్పందించాలి..



ప్రజలు మాపై నమ్మకంతో సర్పంచ్‌లుగా ఎన్నుకున్నారు. వారికి సౌకర్యాలను కల్పించడానికి అభివృద్ధి పనులకు సొంతంగా అప్పులు చేసి పనులు పూర్తి చేశాం. రూ.లక్షల్లో అప్పులు చేసిన ఎంతోమంది వడ్డీ చెల్లించడానికి అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి.
– కడారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్, సుంకెట్

ఆస్తులు అమ్ముకుంటున్నారు..



సర్పంచ్‌లుగా పని చేసిన వారికి రూ.లక్షల్లో బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అప్పులు తీర్చడం కోసం ఆస్తులు అమ్ముకుంటున్నారు. వడ్డీ భారంతో ఎంతో మంది అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే కొంతమంది మాజీ సర్పంచ్‌లు దిగులుతో మరణించిన విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలి.
– గడ్డం చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్, తిమ్మాపూర్

విస్తృత స్థాయిలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి

- ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లల్లో యూనిట్లు ఏర్పాటు చేయాలి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, జిల్లా అధికారులు

సుభాష్‌నగర్: గ్రామ పంచాయతీ భవనం మొదలుకుని రాష్ట్ర సచివాలయం వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, తద్వారా విద్యుత్ ఉత్పత్తి పెంచాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి శనివారం ఆయన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్, రెడ్కో సీఎండీ అనిల్ తదితరులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్‌వోఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం అమలు, ఇరిగేషన్, దేవాదాయ తదితర శాఖల పరిధిలోని ఖాళీ భూములు, అవకాశమున్న చోట్ల సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుకూలమైన డిజైన్లను హైదరాబాద్ నుంచి ఎంపిక చేసి పంపిస్తామని తెలిపారు. ఏవైన మంచి డిజైన్లు ఉంటే, వాటిని పంపాలని సూచించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటి వివరాలు సైతం పంపాలన్నారు. ఇందిరా సౌరగిరి జల వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని జాప్యానికి తావు లేకుండా వారం రోజుల్లోపు వివరాలు పంపాలని సూచించారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, టీజీ రెడ్కో డీఎం రమణ, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీపీ పోతరాజు సాయిచైతన్య

ఖలీల్‌వాడి: వినాయక చవితి వేడుకల్లో ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైన చర్యలు తప్పవని సీపీ పోతరాజు సాయి చైతన్య హెచ్చరించారు. నగరంలోని సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఆయా పోలీస్‌స్టేషన్ ఎస్సైలకు తగిన ఆదేశాలు ఇప్పటికే జారీ చేశామన్నారు. గణేష్‌మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విగ్రహాలను వివాదాస్పద స్థలాల్లో పెట్టవద్దని, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్దకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తగిన పార్కింగ్ స్థలం కూడ ఎంపిక చేసుకోవాలన్నారు. పోలీసుల అనుమతి లేనిదే మండపం పెట్టవద్దన్నారు. రాత్రి 10 తర్వాత డీజే సౌండ్స్ నిషేదం అన్నారు. మండపాలకు విద్యుత్ కనెక్షన్ కోసం సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. డీసీపీ బస్వారెడ్డి, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీలోకి పెరిగిన వరద



బాల్కొండ: ఎస్సారెస్పీలోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల వరద మరింత పెరిగింది. ప్రాజెక్ట్‌లోకి 14630 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 3 వేలు, లక్ష్మికాలువ ద్వారా 150, సరస్వతి కాలువ ద్వారా 300, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 180, గుత్ప లిఫ్ట్ ద్వారా 270, ఆవిరి రూపంలో 462, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగుల నీరు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1078.40(40.8 టీఎంసీలు) అడుగుల నీటి నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

టీఎన్‌జీవీఏ నూతన కార్యవర్గం ఎన్నిక



డొంకేశ్వర్: తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటరినేరియన్స్ అసోసియేషన్ (టీఎన్‌జీవీఏ) నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో శనివారం జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులుగా తిరుమల వినీత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా గంగరాజు, సహాధ్యాక్షుడిగా వినోద్, కోశాధికారిగా వెంకటి, ఉపాధ్యాక్షులుగా రమేశ్, పద్మావతి, నారాయణ, గంగాధర్, చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.నూతన కార్యవర్గాన్ని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్‌తో పాటు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బింగి సురేశ్,అభిషేక్ రెడ్డిలుసన్మానించి అభినందించారు.

క్యాంపస్‌లో కొనసాగుతున్న తీజ్ ఉత్సవాలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో శనివారం ఆరో రోజు తీజ్ ఉత్సవాలు కొనసాగాయి. ఈ సందర్భంగా తెయూ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు సాగర్‌నాయక్ మాట్లాడుతూ.. బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో రవీందర్‌నాయక్, గిరిజనశక్తి విద్యార్థి సంఘం అధ్యక్షుడు శ్రీనురాథోడ్, సచిన్, మోహన్, రాము, రాజు, విద్యార్థినులు సంధ్య, అశ్విని పాల్గొన్నారు.

అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



కుటుంబ సభ్యులతో దాసరి గంగాధర్, కొత్తపేట(డిచ్‌పల్లి)



సోదరులు రాహుల్, చింటులకు రాఖీ కడుతున్న విజయలక్ష్మి(వినాయక్‌నగర్)



హరికృష్ణ, శ్రావణి (తెలంగాణ యూనివర్సిటీ)



నిహితారెడ్డి, నిహంత్‌రెడ్డి(మల్లారం)



ప్రేమ్‌లాల్, ప్రవీణ్‌లాల్‌కు రాఖీలు కడుతున్న పుష్పలత, సౌందర్య(వినాయక్‌నగర్)

సెల్ఫీ విత్ రాఖీ..

నిజామాబాద్ సిటీ: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి, అక్కా తమ్ముళ్ల అనురాగానికి ప్రతీక రక్షాబంధన్. అలాంటి రక్షాబంధన్ వేడుకలను జిల్లా ప్రజలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. కుటుంబమంతా జరుపుకొనే ఈ వేడుకలను సెల్ఫీ తీసుకొని ఎంతో సంబురపడ్డారు. అలాంటి సెల్ఫీలను పలువురు 'సాక్షి'తో పంచుకున్నారు.



మనోజ్, భద్రి మైత్రేయి(కమ్మర్‌పల్లి)



ప్రవీణ్‌కుమార్, నందిని(దుబ్బ)



లింగం యాదవ్, బోధన్



శ్రీనివాస్, సరిత(దుబ్బ)



అప్పల గణేశ్, సుజాత(గోవింద్‌పేట్)



రాజ్‌కుమార్, శివరంజని(హనుమాన్‌నగర్)



సోదరుడు నవీన్‌కు రాఖీ కడుతున్న అంబిక(కెనాల్‌కట్ట)



తండ్రి రాకేశ్‌కు రాఖీ కడుతున్న చిన్నారి తన్విత(వినాయక్‌నగర్)



పవన్‌కుమార్, అమృతకుమారి (ఎల్లమ్మగుట్ట)

అన్నివర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



కాంగ్రెస్ భవన్‌లో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: దేశ స్వాతంత్ర్య పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలక ఘట్టమని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో క్విట్ ఇండియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ భవన్‌లో తాహెర్‌బిన్ జాతీయ జెండాను, నుడా చైర్మన్ కేశ వేణుతో కలిసి ఎగురవేశారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ భవన్‌లో కాంగ్రెస్ జెండాను జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్‌గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో తాహెర్‌బిన్ మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ శాంతియుతంగా చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమం బ్రిటిషర్లను దేశం వదిలేలా చేసిందన్నారు. అన్నివర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఈకార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్‌గౌడ్, నాయకులు నరాల రత్నాకర్, రామర్తి గోపి, నరేందర్‌గౌడ్, లవంగ ప్రమోద్‌కుమార్, మొయిన్, వంశీ, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.



యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ భవన్‌లో జెండా ఎగురవేస్తున్న విపుల్‌గౌడ్

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- డిచ్‌పల్లి సీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్

డిచ్‌పల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, ఇన్ పేషంట్, జనరల్ వార్డు, ల్యాబ్ తదితర విభాగాల పనితీరును పరిశీలించారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీసిన కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, రౌండ్ ది క్లాక్ ఆస్పత్రుల్లో అన్ని సమయాల్లో వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉండాలని ఆదేశించారు. ప్రతీ నెల రెండో శనివారం ప్రత్యేకంగా నిర్వహించే ఆరోగ్యశ్రీ శిబిరానికి అన్ని విభాగాల స్పెషలిస్టు డాక్టర్లు హాజరయ్యేలా చూడాలని, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల పనితీరును ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు.



అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలిస్తున్న కలెక్టర్

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి

భూభారతి దరఖాస్తుల పై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. డిచ్‌పల్లి తహసీల్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యల గురించి తహసీల్దార్ సతీశ్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ నేతలతో ఎమ్మెల్యే సమావేశం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు.. మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నాయకులు గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పలు సమస్యలను అప్పటికప్పుడు అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

గురుకులంలో విశ్వ సంస్కృత భాషా దినోత్సవం



మద్నూర్‌లో మాట్లాడుతున్న డాక్టర్ బి వెంకట్

మద్నూర్(జుక్కల్): భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిరూపం సంస్కృత భాష అని సంస్కృత భాష ప్రచార సమితి జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.వెంకట్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం విశ్వ సంస్కృత భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. అన్ని భాషలకు సంస్కృతం అమ్మభాష అని అన్నారు. వేదాలు, పురాణాలు, శాస్త్రాలు, కావ్యాలు, రామాయణం, మహాభారతం తదితర గ్రంథాలు దేవనాగరిలిపిలో రచించబడ్డాయని చెప్పారు. భారతదేశంలో అనేక విశ్వవిద్యాలయాల్లో సంస్కృతం బోధిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సంస్కృత భాషను ప్రేమించాలని, నేర్చుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు సంస్కృత గేయాలు, సుభాషితాలను, శ్లోకాలను ఆలపించారు. పాఠశాల ప్రిన్స్‌పాల్ గంగాకిషోర్, ఉపాధ్యాయులు సుమన్, నరహరి, సంజీవ్, అశోక్, ప్రవీణ్, హన్మండ్లు, నరేష్, బస్వరాజు, విద్యార్థులున్నారు.

దొన్కల్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

- మద్యం మత్తులో దారుణానికి పాల్పడిన నిందితుడు

మోర్తాడ్: మద్యం మత్తులో తోటి కార్మికుడిని హత్య చేసి పరారైన నిందితుడిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మోర్తాడ్ మండలం దొన్కల్ వడ్డెర కాలనీలో ఓ ఇంటి నిర్మాణం పని కోసం వర్నికి చెందిన ఒల్లెపు నాగరాజు, నిజామాబాద్‌కు చెందిన షేక్ రెహమాన్ జూన్ 26న వచ్చారు. పని ముగిసిన తర్వాత తాము పని చేసిన చోటే మద్యం సేవించారు. అప్పుడు ఇద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో నాగరాజు రెహమాన్‌ను కర్రతో కొట్టి పారిపోయాడు. తీవ్ర గాయాలపాలైన బాధితుడిని స్థానికులు ఆర్మూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనలో నిందితుడైన నాగరాజు ఎవరికి కనిపించకుండా పోయాడు. వర్నిలో నిందితుడి తల్లి ఉంటున్నా నాగరాజు మాత్రం రోజుకో చోట చోట పని చేస్తూ సంచారం చేస్తూ ఉండేవాడు. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు ఇళ్లను నిర్మించే మేస్త్రీలను ఆరా తీయడం మొదలు పెట్టారు. నాగరాజు మొదటి నుంచి ఓ చోట స్థిరంగా ఉంటూ పని చేసేవాడు కాదని పోలీసులు గుర్తించారు. అతనికి మొబైల్ ఫోన్ లేకపోవడంతో ఎక్కడ నుంచైనా అందుబాటులో ఉన్న ఫోన్‌ల నుంచి తన తల్లికి అప్పుడప్పుడు పలకరించేవారు. ఒకవైపు తల్లికి వచ్చే ఫోన్‌లపై నిఘా పెంచిన పోలీసులు ఇళ్ల నిర్మించే మేస్త్రీల నుంచి సమాచారం రాబడుతూ నిందితుడి జాడను కనుగొన్నారు. ఇటీవల నిందితుడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించిన పోలీసులు రెహమాన్‌పై దాడి చేసింది తానే అని అంగీకరించాడు. భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ తన బృందంతో 40 రోజుల పాటు తీవ్రంగా శ్రమించి నిందితుడిని అరెస్టు చేయడం విశేషం. ఇదిలా ఉండగా సంచారం చేస్తూ జీవితం గడుపుతున్న నిందితుడు నాగరాజుకు ఆధార్ కార్డు లేకపోవడంతో అతని చిరునామాపై పోలీసులే ఆధారకార్డును తీయించి జైలుకు పంపించారు.

సిబ్బంది కృషి ఎంతో ఉంది

ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనలతో దొన్కల్ హత్య కే సు నిందితుడిని పట్టుకోవడంలో మా సిబ్బంది కృషి ఎంతో ఉంది.రోజుకో ఊరు మారే నిందితుడు పని చేసే చోటును ప క్కాగా గుర్తించడానికి ఎక్కువ సమయం పట్టింది. మా సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని అరెస్టు చేయడం జైలుకు పంపించడం జరిగింది.

– సత్యనారాయణ, సీఐ, భీమ్‌గల్

చోరీకి పాల్పడిన ముగ్గురి నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

మాక్లూర్: మండలంలోని కృష్ణనగర్‌లో ఇటీవల శ్రీహరి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన ముగ్గురి నిందితులను మాక్లూర్ పోలీసులు అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను ఏసీపీ రాజారత్నం తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 1న కృష్ణనగర్‌లో తాళం వేసి ఉన్న శ్రీహరి ఇంట్లో నిందితులు చోరీకి పాల్పడగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో శనివారం మాణిక్‌బండార్ చౌరస్తాలో అనుమానంగా తిరుగుతున్న ముగ్గురి నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వారిని తమదైన శైలిలో విచారింగా కృష్ణనగర్‌లో చోరీకి పాల్పడింది తామేనని నిందితులు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి 4.8 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. పదివేల నగదు, రెండు ఫోన్లు, ఐదు బైక్‌లు, రూ. 50 వేలు విలువ చేసే రోల్డ్ గోల్ బంగారాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. పట్టుబడిన వారిలో కామారెడ్డి జిల్లాకు చెందిన చాకలి రాజు, కన్నె లింగం, మరొకరు నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం దూపల్లికి చెందిన నగేశ్ పోలీసులు గుర్తించారు. వీరు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన మాక్లూర్ ఎస్సై రాజశేఖర్‌ను ఏసీపీ అభినందించారు.

వ్యక్తిని బెదిరించి నగదు అపహరణ

కామారెడ్డి క్రైం: ఓ వ్యక్తిని బెదిరించి అతని వద్ద ఉన్న రూ. పది వేలు అపహరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. సదాశివనగర్ మండలం లింగంపల్లికి చెందిన చాకలి సాయిరాం అనే వ్యక్తి తన వ్యవసాయ పొలంలో బావికి అవసరమైన మోటారును కొనుగోలు చేయడానికి ఈ నెల 8 న రూ. పది వేలు వెంట తీసుకుని కామారెడ్డికి వచ్చాడు. అనుకున్న మోటారు లభించక తిరిగి వెళ్లేందుకు కొత్త బస్టాండ్ ప్రాంతానికి చేరుకుని ఓ హోటల్ వద్ద ఆగాడు. అక్కడకు వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి సాయిరాం ను ఇనుపరాడ్డుతో బెదిరించాడు. సాయిరాం జేబులో ఉన్న రూ.పది వేలు లాక్కుని పరారయ్యాడు. దుండగుడు చంపుతానని బెదిరించడంతో భయంతో అదే రోజున ఫిర్యాదు చేయలేదని బాధితుడు తెలిపాడు. పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు.

క్రైం కార్నర్

దుస్తుల షాపు దగ్ధం



మాక్లూర్: మండలంలోని ముల్లంగి(బి)లో శనివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బట్టల షాపు దగ్ధం కాగా సుమారు రూ. 12 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన నీరడి ప్రశాంతి నాలుగేళ్ల క్రితం గ్రామంలో కిరాణ షాపుతో పాటు బట్టల షాపును నిర్వహిస్తున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పెద్ద మొత్తంలో చీరలు కొనుగోలు చేసి దుకాణంలో పెట్టారు. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారు జామున షార్ట్‌సర్క్యూట్ జరగడంతో షాపులో ఉన్న వస్తువులు, బట్టలన్నీ కాలిపోయాయి. ప్రమాద విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పంచనామా నిర్వహించినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సందీప్ శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. చంద్రాయన్‌పల్లి శివారులోని జాతీయ రహదారి పక్కన కుళ్లిన స్థితిలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉందని, మృతుడి ఒంటిపై నేవీ బ్లూ కలర్ ప్యాంట్, తెల్లటి బనియన్, వైట్ అండ్ బ్రౌన్ చెక్స్ కలిగిన షర్ట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712659854 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

పేకాట స్థావరంపై దాడి

తాడ్వాయి: మండల కేంద్రంలోని పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై మురళి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఓ రేకుల షెడ్డు వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో ఇద్దరిని పట్టుకోగా వారి నుంచి రూ. 1700 నగదును, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

విద్యుత్‌షాక్‌తో మేకలు మృతి

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని అడివిలింగాల గ్రామ శివారులో విద్యుత్ షాక్ తగిలి రెండు మేకలు మృతి చెందినట్లు స్థానికులు శనివారం తెలిపారు. గ్రామంలోని మహ్మద్ సలీంకు చెందిన మేకలు గ్రామ శివారులో మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన విద్యుత్ తీగలు తగలడంతో షాక్ తగిలి మృతి చెందాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నష్ట పరిహారం అందేలా చూడాలని బాధితుడు కోరుతున్నాడు.

యువకుడి అదృశ్యం

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లికి చెందిన దుబ్బాక సాయితేజ అదృశ్యమైనట్లు ఎస్సై జాడె సుస్మిత శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయితేజ విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. సెలవుల కోసం నర్సింగ్‌పల్లికి వచ్చిన సాయితేజ ఆ తర్వాత హాస్టల్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సుమారు రెండు నెలల నుంచి సాయితేజ కనిపించకపోవడంతో స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి దుబ్బాక సావిత్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పండుగ పూట విషాదం

- రాఖీ కట్టించుకొని తిరిగి వెళ్తుండగా ప్రమాదం
- కంటెయినర్ ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన సాయిబాబు(ఫైల్)

నవీపేట: రాఖీ పండుగను పురస్కరించుకొని ఓ సోదరుడు అక్కతో రాఖీ కట్టించుకొని స్కూటీపై తిరిగి వస్తుండగా అనంత లోకాలకు వెళ్లిన ఘటన నవీపేట మండలం అబ్బాపూర్ (ఎం) శివారులో చోటు చేసుకుంది. ఎస్సై వినయ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా బాసరకు చెందిన వర్గంటి సాయినాథ్, కవితలకు కుమార్తె సాయిప్రియ, కుమారుడు సాయిబాబు అలియాస్ బబ్లూ(21) ఉన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట్‌లో ఉంటున్న కవిత వద్దకు బబ్లూ రాఖీ పండుగ సందర్భంగా శనివారం ఉదయం స్నేహితుడు అరవింద్‌తో కలిసి స్కూటీపై వెళ్లాడు. అక్కతో రాఖీ కట్టించుకొని తిరిగి వస్తుండగా అబ్బాపూర్(ఎం)–జగ్గారావు ఫారమ్ మధ్యలో ముందు వెళ్తున్న కంటెయినర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి దానిని ఢీకొన్నారు. ఈ ఘటనలో బబ్లూ కింద పడి తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అరవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి మేనమామ బలగం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దొంగ సొత్తును కొనుగోలు చేసిన ఇద్దరు..

కామారెడ్డి క్రైం: పట్టుబడిన దొంగలు ఇచ్చిన సమాచారంతో దొంగ సొత్తును కొనుగోలు చేసిన ఇద్దరిని గాంధారి పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. జాతీయ రహదారుల వెంబడి ఆగి ఉన్న వాహనాలను, సమీపంలోని నివాస గృహాలను టార్గెట్ చేస్తూ నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పరిధిలో తరచూ దారి దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్న మహారాష్ట్ర లోని నాందేడ్ ప్రాంతానికి చెందిన ఓ పార్థీ గ్యాంగ్‌ను కామారెడ్డి పోలీసులు ఇటీవల అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో 8 నెలలుగా పరారీలో ఉన్న భాస్కర్ బాపూరావు చౌహాన్ అనే నిందితుడిని రెండు రోజుల క్రితం గాంధారి పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు చోరీ చేసిన సందర్భాల్లో దొంగ సొత్తును కొనుగోలు చేసే వ్యక్తులను మహారాష్ట్రకు చెందిన బీదర్ అభిషేక్, ఇర్ఫాన్ నూర్‌ఖాన్ లుగా గుర్తించారు. వారిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. వారి నుంచి 8 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. దొంగ సొత్తును ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయకూడదన్నారు. ఎవరికైనా ఇలాంటి సొత్తు అందితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితులను పట్టుకోవడంలో విశేషంగా కృషి చేసిన సీఐలు సంతోష్ కుమార్, శ్రీనివాస్, ఎస్సైలు ఆంజనేయులు, ఉస్మాన్, సిబ్బందిని అభినందించారు.